క్లుప్తంగా

రేపు ప్రజాగర్జన బహిరంగ సభ

నిజాంపేట్: సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 11న ప్రజాగర్జన బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు సీపీఐ బాచుపల్లి మండల నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు సభ ఉంటుందన్నారు. వేలాది కార్మికులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

యాదవుల అభివృద్ధికి కృషి చేస్తా



దూదిమెట్ల సోమేష్‌యాదవ్‌ను సత్కరిస్తున్న యాదవ సంఘం నాయకులు

కుత్బుల్లాపూర్: యాదవ కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తానని అఖిలభారత యాదవ మహాసభ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు దూదిమెట్ల సోమేశ్‌యాదవ్ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లకు చెందిన యాదవులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా సోమేశ్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి గొర్రెలు, బర్రెలు ఇప్పించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. యాదవ సంఘం నాయకులు అంజన్న, పండరి, బీరప్ప, పున్నయ్య, మాణిక్యం, విఠల్ తదితరులు ఉన్నారు.

నేటి రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయండి

ఆల్విన్‌కాలనీ: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పాపిరెడ్డినగర్‌లో ఆర్‌ఎంసీ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు కాలనీ అధ్యక్షుడు చంద్రారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీవీరాంజనేయ శివాలయం ప్రాంగణంలో కమిటీహాల్‌లో ఉదయం 7గంటలకు శిబిరం ప్రారంభం అవుతుందన్నారు. ఈ రక్తదాన శిబిరాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్, కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. అదే విధంగా ఆశ్రయ్, ఆకృతి స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినికిడి పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

గొడుగుల పంపిణీ



గొడుగులు పంపిణీ చేస్తున్న సామాజిక కార్యకర్త రవీందర్ ముదిరాజ్

సుభాష్‌నగర్: రోడ్ల పక్కన పండ్లు, కూరగాయలు, పూలు అమ్ముకునే వారు ఎండ నుంచి జాగ్రత్త పడాలని సామాజిక కార్యకర్త రవీందర్ ముదిరాజు అన్నారు. శుక్రవారం సూరారం ప్రధాన రోడ్డు పక్కన ఎండలో పండ్లు కూరగాయలు విక్రయిస్తున్న వారికి ఎండ నుంచి కాపాడుకోవడానికి గొడుగులు పంపిణీ చేశారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేస్తాం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్‌లో రూ.95 లక్షల వ్యయంతో చేపట్టనున్న కాంపౌండ్ వాల్, పార్కు అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. పెండింగ్‌లో పనులను సైతం త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సబిహాబేగం, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, అబ్దుల్ హమీద్, జ్ఞానేశ్వర్, సంపత్ రెడ్డి, నూర్‌ఖాన్, రఫిక్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి ప్రాంతంలో శుక్రవారం ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సదరు వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. అతని వివరాల కోసం ఆరా తీయగా స్థానికంగా భిక్షాటన చేసేవాడని, వడదెబ్బతో మృతి చెంది ఉంటాడని పోలీసులు పేర్కొంటున్నారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా తెలంగాణ సంక్షేమ సంబురాలు



ఎమ్మెల్యే వివేకానంద్‌కు కంబలి కప్పి గొర్రె పిల్లను అందజేసిన యాదవ సంఘం నాయకులు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్



లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్..



సభకు హాజరైన లబ్ధిదారులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు

● ఎమ్మెల్యే వివేకానంద్

సుభాష్‌నగర్: ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది మంది రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధి పొందారని.. ఇది సీఎం కేసీఆర్ కార్యదీక్ష, పట్టుదలతోనే సాధ్యపడిందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బహదూర్‌పల్లిలో »తెలంగాణ సంక్షేమ సంబురాలు« ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ చేతుల మీదుగా 63 మంది సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు రూ.25,18,500 విలువ గల చెక్కులు, 94 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ.94,10,000 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు.

◆ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గడిచిన తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ హయాంలో సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా 4596 మందికి రూ.28.16 కోట్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా 10777 మందికి రూ.102.54 కోట్లు, ఆసరా పింఛన్లు 30572 మందికి నెలకు రూ.6.62 కోట్లు, సంవత్సరానికి రూ.79.54 కోట్లు, దళిత బంధు ద్వారా 100 మందికి రూ.10 కోట్లు, జీహెచ్‌ఎంసీ పరిధిలో డ్వాక్రా 7799 గ్రూపులకు 452 కోట్ల 95 లక్షలు, దుండిగల్‌లో 688 గ్రూపులకు 42 కోట్ల రుణాలు, 363 మందికి రూ.5.1 కోట్ల ఖర్చుతో గొర్రెల పంపిణీ.. ఇలా మొత్తం రూ.261 కోట్ల రూపాయల విలువ చేసే సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామన్నారు.

◆ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నేడు కులవృత్తుల చేసుకునే 11 మందికి లక్ష రూపాయల పంపిణీ పథకం ప్రారంభించి.. రూ.11 లక్షలు ఆర్థిక ప్రేరణ కింద అందజేయడం పట్ల సంతోషంగా ఉందని పేర్కొన్నారు. స్వరాష్ట్రంలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందుతున్నాయని అన్నారు. సీఎం కేసీఆర్ సుపరిపాలనలో సంక్షేమ ఫలాలు పొందని ఇల్లు లేదన్నారు. రైతులకు రైతుబంధు, రైతుబీమా, రైతు భరోసా, దళితులకు దళిత బంధు ఇలా అనేక పథకాలు అందజేస్తోందన్నారు.

◆ కుల వృత్తిదారులను ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం వారి కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారని తెలిపారు. వెనుకబడిన సామాజిక వర్గాల్లోని చేతి వృత్తులు, కులవృత్తులు నిర్వహించే మేదరి, కమ్మరి, రజక, నాయి బ్రాహ్మణ, విశ్వ బ్రాహ్మణుల అభ్యున్నతికి ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. గత ప్రభుత్వాలు కంటి తుడుపుగా ఇచ్చిన 200 రూపాయల పింఛన్‌ను ఆసరా కింద రూ.2,016, దివ్యాంగులకు రూ.3,016కు పెంచడం కేసీఆర్‌తోనే సాధ్యమైందని అన్నారు.

◆ గతంలో ఎన్నో ప్రభుత్వాలు పాలించినా ప్రజల సంక్షేమానికి ఏనాడు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కానీ సీఎం కేసీఆర్ ఉద్యమ నాటి నుంచి ప్రజల కష్టాలను దగ్గర నుంచి చూసిన వ్యక్తిగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద, మధ్య తరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్లు, తహసీల్దార్లు, ఎమ్మార్వోలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దళితబంధు రూ.10లక్షలతో ట్రాక్టర్ కొన్నా..



గతంలో నేను కార్మికుడిగా పని చేసేసేవాడిని. దళిత బంధు ద్వారా రూ.10లక్షలు వచ్చాయి. దీంతో ట్రాక్టర్ కొనుగోలు చేశాను. ప్రస్తుతం కాంట్రాక్టర్ నడుపుతూ ఉపాధి పొందుతున్నా. ప్రభుత్వం నుంచి పదిలక్షల సహాయం పొందడం నమ్మలేకపోతున్నా. బీఆర్‌ఆర్ ప్రభుత్వానికి మా కుటుంబం ఎంతో రుణపడి ఉంది.

– కె.లింగం, లాల్ సాహెబ్‌గూడా

కల్యాణలక్ష్మి ఆడపిల్లలకు వరం



తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి ఆడపిల్లలకు ఒక వరం లాంటిది. ఈ పథకం ద్వారా మాలాంటి మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుంది. నా కూతురు సుప్రజ పెళ్లి చేయగా కల్యాణలక్ష్మి కింద దరఖాస్తు పెట్టుకున్నాం. నాకు 1 లక్ష 16 వేల రూపాయలు సహాయంగా అందాయి.

– ఏ.లక్ష్మి, సూరారం గ్రామం

రూ.35 లక్షలు మంజూరు చేస్తున్నారు..



నాకు చిన్నప్పటి నుంచి ఎత్తైన కొండలు ఎక్కాలంటే ఎనలేని ఇష్టం. ముందుగా భువనగిరి కోట ఎక్కినా.. తర్వాత ఆఫ్రికాలోని ఐదు కిలోమీటర్ల ఎత్తులో ఉన్న కేటు కొండ ప్రాంతాన్ని ఎక్కాను. ఎవరెస్టుతో పాటు ఆసియా ఖండంలో ఉన్న అన్ని కొండ ప్రాంతాలను ఎక్కాలన్నదే నా కోరిక. అందుకు రూ.35 లక్షల మేర ఖర్చవుతుంది. స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద ద్వారా కేసీఆర్ సార్ నా అభిరుచిని తెలుసుకుని నాకు 35 లక్షలు మంజూరు చేస్తున్నందుకు సంతోషంగా ఉంది.

– యశ్వంత్, బహదూర్‌పల్లి

ఉద్యమకారుడు సాగర్‌యాదవ్ ఆత్మహత్య

నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు



సాగర్ యాదవ్ (ఫైల్)



సాగర్‌యాదవ్ ఇంటికి చేరుకున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, బీఆర్‌ఎస్ నాయకులు

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు సాగర్ యాదవ్ శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. 2001లో కేసీఆర్ టీఆర్‌ఎస్ పార్టీ స్థాపించినప్పటి నుంచి తెలంగాణ ఉద్యమ సమయంలో చురుగ్గా పాల్గొన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి ఉద్యమంలో ధర్నాలు, రాస్తారోకోలలో పాల్గొంటూ పోలీసుల లాఠీ దెబ్బలు తిన్నాడు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన అనంతరం నూతనంగా ఏర్పడిన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా సాగర్ యాదవ్ పని చేస్తున్నాడు.

కుటుంబ కలహాలతోనే..!

సాగర్ యాదవ్ ఆత్మహత్యకు కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులే కారణమని తెలుస్తోంది. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా చేరిన సాగర్ యాదవ్ రెండేళ్ల నుంచి ఉద్యోగం చేయడం లేదు. కాగా భార్య వర్షతో గొడవ పడే ప్రతిసారి సాగర్‌యదవ్ సూసైడ్ నోట్ రాసేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం సైతం వాట్సప్‌లో సూసైడ్ నోట్ పంపిన సాగర్‌యాదవ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి రియాన్స్, అభినందన్ ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రముఖుల నివాళులు..

ఆత్మహత్య చేసుకున్న సాగర్ యాదవ్ మృతదేహాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సందర్శించారు. సాగర్‌యాదవ్ కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రభుత్వం నుంచి సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, కొలన్ గోపాల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్లు జగన్, బాలాజీ నాయక్ తదితరులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.

హాథ్ సే హాథ్ జోడో



రాజీవ్‌గాంధీనగర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న టీపీసీసీ ప్రతినిధి హన్మంతరెడ్డి

నిజాంపేట్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్స్ బకాయిల విడుదలపై తొలి సంతకం ఉంటుందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా శుక్రవారం బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌లో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులు వేధిస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు శ్రీశైలంయాదవ్, జీతయ్య, శంకర్, మధుసూదన్‌రెడ్డి, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ బస్ ఆఫీసర్స్



ఊరూరు వెళ్లి ఆర్టీసీ సేవలను వివరిస్తాం

జీడిమెట్ల: తెలంగాణ ఆర్టీసీ ప్రారంభించిన విలేజ్ బస్ ఆఫీసర్స్ కార్యక్రమంతో ఆర్టీసీకి లాభం చేకూరుతుందని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పవన్ అన్నారు. శుక్రవారం జీడిమెట్ల బస్‌డిపోలో ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం విజయ్‌కుమార్ మాట్లాడుతూ... విలేజ్ బస్ ఆఫీసర్స్ ప్రతి గ్రామానికి వెళ్లి ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రజలకు వివరిస్తారన్నారు. దీని వలన ప్రజలకు ఆర్టీసీ అందించే రాయితీలు, సేవలు తెలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ సునీత, కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

అశ్రునయనాల నడుమ ప్రభాకర్‌రెడ్డి అంత్యక్రియలు



విలపిస్తున్న కుటుంబ సభ్యులు

దుండిగల్: దుండిగల్ ఎస్సై ప్రభాకర్‌రెడ్డి అంత్యక్రియలు శుక్రవారం అశ్రునయనాల మధ్య ముగిశాయి. దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న ప్రభాకర్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. అతని మృతదేహాన్ని తన సొంత గ్రామమైన నల్గొండ జిల్లా నకిరేకల్‌కు తరలించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, సహచర పోలీసులు కడసారి చూపు కోసం వేలాదిగా తరలివచ్చారు. అతని మృతదేహంపై పడి కుటుంబ సభ్యులు విలపించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. పోలీసులు అధికార లాంఛనాలతో గాల్లో కాల్పులు జరిపి అంత్యక్రియలు జరిపారు. ప్రభాకర్‌రెడ్డితో తమకున్న బంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రభాకర్‌రెడ్డికి భార్య, మూడేళ్ల కుమార్తె ఉంది. అతని సోదరుడు సైతం ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పని చేస్తున్నాడు.

12న భవిష్య నిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయంలో ఈనెల 12వ తేదీన భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ డాక్టర్ హేమంత్ తెలిపారు. కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్టీసీ బస్ టెర్మినల్‌లోని రెండో అంతస్తులోని కార్యాలయానికి ఖాతాదారులు రావాలన్నారు. కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బీహెచ్ఈఎల్, జీడిమెట్ల, సనత్‌నగర్ ఖాతాదారులు పాల్గొవచ్చన్నారు.

రేపు జేఈఈ మెయిన్స్ అవగాహన సదస్సు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి వెంకట్రావునగర్ కమ్యూనిటీహాల్‌లో ఈనెల 11న గురు అకాడమీ ఆధ్వర్యంలో జేఈఈ మెయిన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ రమేష్ నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జేఈఈ, మెయిన్స్‌కు ఎలా సన్నద్ధం కావాలి.. ఏ పుస్తకాలు చదవాలి.. రోజుకి ఎన్ని గంటలు చదవాలి.. ఏ కాన్సెప్ట్ నేర్చుకోవాలి.. అభ్యర్థి ఆలోచన విధానం ఎలా ఉండాలి? అనే విషయాల మీద అవగాహన కల్పిస్తారన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ సదస్సు కొనసాగుతుందన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



బాధితులకు చెక్కులు అందజేస్తున్న శంభీపూర్ రాజు

దుండిగల్: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలు కార్పొరేట్ స్థాయి వైద్యం పొందుతున్నారని.. సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీకి చెందిన ఆశమ్మ, తేజ అనారోగ్యానికి గురయ్యారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారు చికిత్స చేయించుకునేందుకు శంభీపూర్ రాజును ఆశ్రయించారు. స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిధులను మంజూరు చేయించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆశమ్మకు రూ.40 వేలు, తేజకు రూ.60 వేల చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, నేతలు రావల్‌కోల్ సాయికిరణ్‌గౌడ్, మంగమ్మ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక..

దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటకు చెందిన పలు పార్టీల నేతలు శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బల్వంత్‌రెడ్డి, చౌదరిగారి సిగ్నేశ్వర్‌రెడ్డి, కాసాని బాలకృష్ణలు పార్టీలో చేరారు. బౌరంపేట పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బందిపై దాడి

● కేసు నమోదు చేసిన కూకట్‌పల్లి పోలీసులు

భాగ్యనగర్‌కాలనీ: రోడ్డుపై వెలిసిన బ్యానర్లను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బందిపై అధికార పార్టీకి చెందిన కొందరు దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 5వ తేదీన జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు రాత్రి సమయంలో రోడ్డుపై ఉన్న ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. కమిషనర్ ఆదేశాల మేరకే ఫ్లెక్సీలు తొలగిస్తున్నామని ఎంత చెప్పినా వినకుండా దాడికి పాల్పడినట్లు జీహెచ్‌ఎంసీ సిబ్బంది పేర్కొన్నారు. తమపై దాడికి పాల్పడిన సీహెచ్ ప్రభాకర్, సంతోష్‌కుమార్ అతడి స్నేహితులపై తగిన చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వరద నీటి కాల్వ పనులను త్వరగా పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నందమూరి నగర్ కాలనీలో రూ.40 లక్షల అంచనా వ్యయంతో పడుతున్న వరద నీటి కాల్వ నిర్మాణ పనులను చేపడుతున్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శుక్రవారం అధికారులతో కలిసి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వరద నీటి కాల్వ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు.

తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత



కుత్బుల్లాపూర్: తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పేట్‌బషీరాబాద్ పోలీసుల గురువారం అర్ధరాత్రి కొంపల్లి ప్రాంతంలో ఒంటరిగా తచ్చాడుతున్న శివమణిత్ రాజ్ (9)ను గుర్తించిన పేట్‌బషీరాబాద్ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. వివరాల కోసం ఆరా తీయగా అంబర్‌పేట్ ప్రాంతానికి చెందిన వాడిగా గుర్తించారు. ఎస్సై రామ్‌నారాయణ ఫోన్ నంబర్ ఆధారంగా తల్లిదండ్రులకు సమాచారం అందించి శుక్రవారం మధ్యాహ్నం వారికి అప్పగించారు. కాశీకి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో కొంపల్లిలో బస్సు దిగిన బాలుడు తిరిగి ఎక్కకపోవడం తప్పిపోయాడని తల్లిదండ్రులు పేర్కొన్నారు. రాత్రి నుంచి బాలుడిని స్టేషన్‌లో పడుకోబెట్టి శుక్రవారం ఉదయం బాలుడి కుటుంబసభ్యులకు సమాచారం అందజేసి అప్పజెప్పడంతో బాధిత కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

బస్టాప్‌కు పైకప్పు లేదు.. ప్రయాణికులు నిలబడలేరు!




గాంధీనగర్ బస్‌షెల్టర్‌కు పైకప్పు లేకపోవడంతో బట్ట చుట్టిన దృశ్యం

రంగారెడ్డినగర్: సంవత్సర కాలంగా ఆ ప్రాంత వాసులకు బస్‌షెల్టర్ నీడ కరువడటంతో ఇబ్బందులు పడుతున్నారు. ధ్వంసమైన బస్సుషెల్టర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సాక్షాత్తు ఎమ్మెల్యే లేఖ రాసినా ఉలుకు.. పలుకు లేదు. దీంతో ఎండలోనే నిలుచుకుని బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ ప్రధాన రోడ్డులోని బస్‌షెల్టర్ సంవత్సరం క్రితం ధ్వంసమైంది. పారిశ్రామికవాడ ప్రాంతం కావడంతో నిత్యం వివిధ పరిశ్రమలకు వచ్చే కార్మికులు, అదే విధంగా చుట్టు పక్కల బస్తీల ప్రజలు ఈ బస్టాప్‌లోనే బస్సుల కోసం వేచి చూస్తుంటారు.

◆ ఈ నేపథ్యంలో గాంధీనగర్ వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు జల్దా లక్ష్మీనాథ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించగా ఆయన బస్టాప్ నిర్మించాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ అడ్వర్‌టైజ్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్‌కు లేఖ రాశారు. ఇది జరిగి దాదాపు ఏడాది పూర్తవుతున్నా బస్టాప్ ఏర్పాటులో ఎటువంటి పురుగతి లేదు.

ధ్వంసమైన బస్‌షెల్టర్‌కు బట్టే నీడ..

ప్రజలు పడుతున్న ఇబ్బందులు నేపథ్యంలో స్థానికులు బస్‌షెల్టర్‌కు నాలుగు వైపులా కర్రలు ఏర్పాటు చేసి పైన బట్ట చుట్టారు. దీంతో ఎండ నుంచి కొంత మేర ప్రయాణికులకు ఉపశమనం లభిస్తోంది. అయితే వర్షాలు పడుతున్న నేపథ్యంలో బట్ట సైతం తడిపోతుండటంతో బస్టాప్‌లో నిలుచునే వీలు లేకుండా పోతోంది. వర్షాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి శాశ్వత ప్రాతిపదికన బస్సు షెల్టర్‌ను నిర్మించిన ప్రయాణికుల కష్టాలు తీర్చాలని స్వామి వివేకానంద యూత్ అధ్యక్షుడు లక్ష్మీనాథ్ కోరుతున్నారు.



జీహెచ్‌ఎంసీ అధికారులకు ఎమ్మెల్యే రాసిన లేఖ